సాక్షి
కర్నూలు
గురువారం, 13, ఏప్రిల్, 2023



వైభవం.. ఆంజనేయ రథోత్సవం

ఆస్పరి: మండలంలోని బిణిగేరిలో ఆంజనేయ స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా సాగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో లోక కల్యాణార్థమై దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సాక్షిగణపతి స్వామికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రుడికి విశేష పూజలు నిర్వహించారు.



ఎన్నాళ్లో వేచిన ఉదయం

98 డీఎస్సీ అభ్యర్థుల టీచర్ కల ఫలించింది. అర్హులకు బుధవారం విద్యాశాఖ అధికారులు కర్నూలులో కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందజేశారు.

8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:37	ఉ॥ 4:40
ఆదోని	సా॥ 6:40	ఉ॥ 4:43
నంద్యాల	సా॥ 6:37	ఉ॥ 4:43
ఆత్మకూరు	సా॥ 6:35	ఉ॥ 4:37
బనగానపల్లె	సా॥ 6:40	ఉ॥ 4:37

హదీస్ వెలుగు :
అల్లాహ్‌కి ఇష్టమైన పుణ్య కార్యాల్లో జకాత్ ఒకటి. మీ ధన, సంపద మొత్తంలో 2.50 శాతం జకాత్ పేరుతో దానధర్మాలు చేయండి.
– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

శ్రీ మఠంలో పేజావర్ మఠం పీఠాధిపతి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు ఉడిపిలోని పేజావర్ మఠం పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు బుధవారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు స్వాగతం పలికారు. శ్రీ రాఘవేంద్రుల మూలబృందావనానికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు చేశారు. పీఠాధిపతితో కలిసి మఠంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: జిల్లాలోని ఏపీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్ యు.సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్ఏటీ-2023 ద్వారా 5వ తరగతిలోని అన్ని సీట్లకు, 6,7,8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు వచ్చే నెల 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే ఇంటర్మీడియెట్, డిగ్రీ మొదటి సంవత్సర అడ్మిషన్లకు ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ సెట్ పరీక్ష నిర్వహిస్తామని, ఈ పరీక్ష సైతం వచ్చే నెల 20వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. మైనార్టీ కాలేజీ, స్కూళ్లలో మాత్రం ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండానే వచ్చే నెల 15వ తేదీన నేరుగా అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. జనరల్ (గురుకుల పాఠశాల) విభాగం స్కూల్ విద్యార్థులకు మాత్రం ఈ నెల 4 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో https://aprs.apcfss.in ద్వారా చేసుకోవాలన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధి సిబ్బందితో సమావేశమైన డ్వామా పీడీ

వెల్దుర్తి: ఉపాధిహామీ పనుల్లో కూలీల హాజరు పెంచాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సిబ్బందికి ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారులు సిద్ధలింగమూర్తి, ఫక్కీరప్పలతో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీ భవనంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ దుర్వినియోగమైన నిధులను త్వరితగతిన రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. ఏప్రిల్-2023 నుంచి ఉపాధి కూలీలకు పెంచిన వేతనం అమలవుతుందన్నారు. ప్రతిరోజు గరిష్ట వేతనం రూ.272 దక్కేలా కూలీలకు కూలీలకు పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ రాజునాయక్, ఈసీ భరత్, సీఓలు, టీఏలు పాల్గొన్నారు.


> 'హంద్రీ-నీవా ప్రధాన కాలువ పనులు కుప్పం చేరే వరకు డిస్ట్రిబ్యూటరీల(ఉప, పిల్ల కాలువలు) నిర్మాణం నిలిపేయాలని అప్పటి చంద్రబాబు ప్రభుత్వం 2015 ఫిబ్రవరి 23న జీఓ 22 జారీ చేసింది. చంద్రబాబు చేసిన పాపంతో జిల్లాలో 80వేల ఎకరాలకు సాగు నీరు అందని పరిస్థితి.'
> – ఇదొక్క జీఓ చాలు కర్నూలు రైతులపై చంద్రబాబుకు ఉన్న ప్రేమ ఏపాటిదో చెప్పేందుకు.

> 'విభజన తర్వాత ఏర్పడిన రాష్ట్రానికి తొలి స్వాతంత్య్ర దిన వేడుకలు ఆగస్టు 15న కర్నూలులో నిర్వహించారు. మువ్వన్నెల జెండా సాక్షిగా జిల్లా అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 15 హామీలను వల్లె వేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండగా ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయలేకపోయారు.
> – ఈ ఒక్క ఉదాహరణ చాలు చంద్రబాబు మాటలకు, చేతలకు పొంతన లేదని చెప్పేందుకు.

గుర్తున్నాయా బాబూ.. న్యాయం చేయలేదేం లోకేష్!

ఐదేళ్ల చంద్రబాబు పాలన హామీలకే పరిమితం

- కర్నూలు రైతులకు అన్యాయం చేస్తూ జీఓ 22
- బీడుగా మారిన 80వేల ఎకరాలు
- న్యాయరాజధాని ఏర్పాటుకు అడుగడుగునా అడ్డంకులు
- నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో లోకేష్ పాదయాత్ర



సాక్షి ప్రతినిధి కర్నూలు: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ప్రజలను, జిల్లా అభివృద్ధిని రాజకీయ కోణానికే పరిమితం చేశారు. ఆ ఐదేళ్లలో ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయిన ఆయన.. చివరకు పూర్తికాకుండానే ఓర్వకల్లు విమానాశ్రయానికి రిబ్బన్ కట్ చేసి తన గొప్పగా ప్రచారం చేసుకున్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులన్నింటినీ పూర్తి చేసి తిరిగి విమానాశ్రయాన్ని ప్రారంభించారు. విమానరాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇలాంటివి చెప్పుకుంటూపోతే చంద్రబాబు ఐదాయి కోకొల్లలు. ఈ క్రమంలో చంద్రబాబునాయుడు వారసుడిగా ఆయన తనయుడు లోకేశ్ 'యువగళం' పేరిట పాదయాత్ర నిర్వహిస్తుండటంతో అప్పటి హామీలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. పాదయాత్ర నేడు నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలోకి ప్రవేశించనుంది. కర్నూలు జిల్లాలోని 7, నంద్యాలలో జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో 40రోజులపాటు యాత్ర సాగేలా ఆ పార్టీ నేతలు రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. యాత్రలో రోజూ సెల్ఫీ చాలెంజ్ పేరుతో లోకేశ్ ఆర్భాటం చేస్తున్నారు. అక్కడక్కడా ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటి అమలుపై కూడా చర్చించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఐదేళ్లకాలంలో ఒక్కటంటే ఒక్క హామీని నెరవేర్చని చంద్రబాబుకు వారసుడిగా వస్తున్న లోకేశ్ తన తండ్రి హామీలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. చివరకు కర్నూలు న్యాయరాజధానిగా చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. దాన్ని కూడా అడ్డుకునేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. చివరకు జిల్లాకు వచ్చి 'హైకోర్టు అమరావతిలోనే ఉండాలి.. రాష్ట్రానికి ఒకే రాజధాని ఉండాలి' అని టీడీపీ నేతలతో నినాదాలు చేయించి జిల్లా ప్రజలను రెచ్చగొట్టడం అప్పట్లో చర్చనీయాంశమైంది. వెనుకబడిన జిల్లాకు 'న్యాయం' జరుగుతుంటే ఆ క్రెడిట్ మరో పార్టీకి వస్తుందని 'అన్యాయం' చేసేందుకు యత్నిస్తున్న బాధ్యతలేని ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు అని న్యాయవాదుల నుంచి సామాన్య ప్రజల వరకు అంతా దుమ్మెత్తిపోస్తున్నారు. రాయలసీమ గర్జన పేరుతో సభ నిర్వహించి చంద్రబాబు వైఖరిని అన్ని వర్గాలు, సంఘాలు తూర్పారబట్టాయి. ఈ క్రమంలో రాజధానిపై తాము పొరపాటు చేశామని లోకేశ్ అంగీకరిస్తాడా? అని ఈ వర్గాలన్నీ ప్రశ్నిస్తున్నాయి.

2014 ఆగస్టు 15న కర్నూలులో చంద్రబాబు ఇచ్చిన అమలు కాని హామీలు ఇవీ..

- శ్రీశైలంలో పులుల పార్క్, ఆలూరులో జింకల పార్కు, నందికొట్కూరులో పక్షుల సంరక్షణ కేంద్రం ఏర్పాటు
- కర్నూలులో నగరానికి ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం
- రూ.150 కోట్లతో కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీకి శాశ్వత భవనాలు.
- ఆత్మకూరు జూనియర్ కళాశాలకు అధ్యాపక పోస్టులు మంజూరు
- డోన్ సమీపంలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైన్స్
- కర్నూలు-బెంగళూరు మార్గాన్ని సూపర్ ఎక్స్‌ప్రెస్ మార్గంగా అభివృద్ధి.
- కర్నూలు కార్పొరేషన్‌ను 'స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి
- కర్నూలు, నంద్యాల పట్టణాలు మహానగరాలుగా అభివృద్ధి
- ఆదోని, ఎమ్మిగనూరులో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ అప్పెరల్ పార్క్ ఏర్పాటు, అభివృద్ధి.
- కర్నూలులో మైనార్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు
- కర్నూలులోని సర్వజన వైద్యశాలను 'రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్' స్థాయిగా అభివృద్ధి చేయడం.
- నంద్యాలను 'సీడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా అభివృద్ధి.
- నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థను డీమ్డ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీగా అభివృద్ధి చేయడం.



రూ.3 కోట్లతో నిర్మించిన ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్

ఒక్క డోన్‌లోనే ఇదీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అభివృద్ధి

హామీలు ఇచ్చి చంద్రబాబు ప్రభుత్వం ఒక్కటీ అమలు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి, రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు చేసింది. ఉదాహరణకు లోకేశ్ అడుగుపెడుతున్న డోన్ నియోజకవర్గాన్ని తీసుకుంటే..

- 30 పడకల ఆస్పత్రిని వంద పడకలకు పెంపు
- రూ.80కోట్లతో కొత్తపల్లి క్రాస్ రోడ్, కంబాలపాడు క్రాస్‌రోడ్‌లో రెండు వంతెనలు ఏర్పాటు
- రూ.10కోట్లతో పార్క్ అభివృద్ధి
- రూ.5కోట్లతో హాస్టల్ భవనం
- రూ.14కోట్లతో డోన్‌లో అంతర్గతరోడ్లు
- రూ.3కోట్లతో ఆర్అండ్‌బీ వసతి గృహ నిర్మాణం
- రూ.8కోట్లతో కూరగాయల మార్కెట్
- రూ.6కోట్లతో మునిసిపల్ నూతన భవనం
- రూ.36కోట్లతో డోన్-రాయలచెరువు రోడ్డు నిర్మాణం
- రూ.49.07 కోట్లతో ప్యాపిలిలో టెర్మినల్ మార్కెట్ మంజూరు. దేశంలోనే ఇది మూడో మార్కెట్.
- వీటితో పాటు డోన్ నియోజకవర్గంలోనే ఏకంగా రూ.1,300కోట్లతో అభివృద్ధి పనులు ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం చేసింది.

న్యాయ రాజధానిపై నిలదీస్తాం



టీడీపీ కార్యదర్శి లోకేష్‌కు రాజకీయాలపై కనీస అవగాహన లేదు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. శాసనమండలిలో తీర్మానం చేశారు. ధర్మపోరాట దీక్షలో ప్రకటించారు.కానీ అమలుకు నోచుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసి న్యాయ రాజధాని చేస్తామన్నారు. దీనిపై టీడీపీ నాయకులు స్పష్టత ఇవ్వాలి. నారా లోకేష్ దీనిపై మాట్లాడాలి. ఈ విషయమై తప్పక నిలదీస్తాం.
– ఓంకార్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, రాయలసీమ జేఏసీ కో కన్వీనర్

రాయలసీమను పట్టించుకోని టీడీపీ



ఉమ్మడి రాష్ట్రం విడిపోయాక నిర్వహించిన మొట్టమొదటి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో అప్పటి సీఎం చంద్రబాబు ఎన్నో వాగ్దానాలు చేశారు. ఇవేవీ నెరవేర్చకుండానే ఆయన పాలన ముగిసింది. యువగళం పేరిట లోకేష్ ఏ ముఖం పెట్టుకొని పాదయాత్ర చేస్తున్నారో అర్థం కావట్లేదు. రాయలసీమను టీడీపీ ఏనాడు పట్టించుకోలేదు. ముందుగా ఆయన తండ్రి ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలి. లోకేష్ మాటలకు, వాస్తవ పరిస్థితికి పొంతన ఉండటం లేదు.
– రోషన్ అలీ, విశ్రాంత తహసీల్దార్



కొత్త బస్టాండ్ నుంచి రూరల్ పోలీసు స్టేషన్ జాతీయ రహదారి వరకు నిర్మించిన నాలుగు లైన్ల రోడ్డు

అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించం

- 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటా
- నూతన ఎస్పీ జి.కృష్ణకాంత్



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించే ప్రసక్తే లేదని నూతన ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, మహిళల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఎస్పీగా విధులు నిర్వహిస్తూ తాజా బదిలీల్లో ఈయన జిల్లాకు నియమితులయ్యారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయం చేరుకోగానే పోలీసు అధికారులు, ఏఆర్ సిబ్బంది స్వాగతం పలికి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా వ్యాస్ ఆడిటోరియంలో విలేకరులతో ఎస్పీ మాట్లాడారు. తన స్వస్థలం అనంతపురం జిల్లా గుత్తి మండలం ఎస్ఎస్ పల్లె అని, రాయలసీమ వాసిగా కర్నూలు జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, డీజీపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాపై పూర్తి అవగాహన ఏర్పరుచుకుని శాంతిభద్రతల విషయంలో అన్ని ప్రభుత్వ శాఖలతో కలసి ముందంజలో ఉంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచి వేస్తామన్నారు. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటామని, సమస్యలపై శాఖ పరంగా సత్వర చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎక్కడ ఏమి జరిగినా చెప్పండి

" మీరు జిల్లాలో చాలా కాలంగా పనిచేస్తున్నారు. నేను కొత్తగా వచ్చాను. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా నా దృష్టికి తీసుకురండి. తెలియకుండా ఏదీ చేయొద్దు' అని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత అడిషనల్ ఎస్పీలు కృష్ణకాంత్ పటేల్, ప్రసాద్, డీఎస్పీలు వెంకటాద్రి, వెంకటరామయ్య, నాగభూషణం, యుగంధర్ బాబు, వినోద్ కుమార్, కేవీ మహేష్, ఇలియాస్ బాషా, డీపీఓ ఏఓ సురేష్ బాబుతో పాటు పలువురు సీఐలు ఎస్పీకి పూలబొకే ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని పేరుపేరున పరిచయం చేసుకుని కొద్దిసేపు మాట్లాడారు.

పలువురు అధికారులను కలసిన ఎస్పీ

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్‌ను, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తిని, ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డిని ఆయన వేర్వేరుగా వారి కార్యాలయాల్లో కలిసి బొకే అందజేశారు.

అగ్రవర్ణ పేదలకు ఆర్థిక దన్ను

- వరుసగా రెండో ఏడాది వైఎస్సార్ ఈబీసీ నేస్తం అమలు
- అగ్రవర్ణ పేద మహిళలకు రూ.15 వేల చొప్పున సాయం
- ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 8,028 మంది మహిళలకు రూ.12.04 కోట్ల కేటాయింపు



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, మేయర్ బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): అగ్రవర్ణాల్లోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికంగా అండగా నిలబడుతున్నారు. వరుసగా రెండో ఏడాది వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద అగ్రవర్ణ పేద మహిళలకు ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున సాయం అందజేశారు. బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి బటన్ నొక్కి ఈ కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని లబ్ధిదారులకు వినిపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకానికి ఈ ఏడాది జిల్లాలో 8,028 అగ్రవర్ణ పేద మహిళలు ఎంపికైనట్లు చెప్పారు. వీరిలో ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున మొత్తం రూ.12.04 కోట్లను సీఎం జమ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం చేసే సాయాన్ని మహిళలు తమ జీవనోపాధులు పెంచుకోవడానికి వినియోగించుకోవాలన్నారు. అనవసరంగా ఖర్చు చేస్తే అటు లబ్ధిదారులకు గాని, ఇటు ప్రభుత్వానికిగాని ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం పేదలను ఆదుకోవడానికి ముందుకొస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ..రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతోపాటు ఇతర ఓసీ సామాజిక వర్గాల్లోనూ పేదలు ఉంటారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రహించి ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయనటువంటి ఈ పథకం ద్వారా పేద మహిళలకు సాయం అందజేస్తున్నారన్నారు. ఇలా వివిధ సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో పేదరికం నిర్మూలనకు సీఎం విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం జిల్లాలోని ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు రూ.12.04 కోట్ల మెగా చెక్కును కలెక్టర్, మేయర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎన్.గోపాల్‌రెడ్డి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వర్గం	లబ్ధిదారుల సంఖ్య	కేటాయించిన మొత్తం రూ. కోట్లలో
రెడ్డి	3,934	రూ.5.94
కమ్మ	860	1.29
ఆర్యవైశ్య	2,165	3.24
బ్రాహ్మణ	702	1.05
క్షత్రియ	22	0.03
ఇతర ఓసీ వర్గాలు	345	0.51
మొత్తం	8,028	12.04

గతంలో ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదు



మేము పేరుకే పెద్ద కులంలో పుట్టాం. ఆర్థికంగా మేము కూడా పేదలమే. అయితే, గతంలో ఏ ప్రభుత్వం అగ్రవర్ణ పేదలను పట్టించుకోలేదు. జగనన్న వచ్చాక మాకు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారు. నా కుమారుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండడంతో అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక పథకాలు వర్తించాయి. నాకు ఈబీసీ నేస్తం కింద వరుసగా రెండో ఏడాది రూ.15 వేలు జమ చేశారు. ఈ డబ్బుతో టైలరింగ్ వృత్తిని మెరుగుపరుచుకుంటాను.
– ఎం.కల్యాణి, చిన్నమార్కెట్ ఏరియా, కర్నూలు

ప్రభుత్వ పథకాలతో ఉన్నతంగా జీవిస్తున్నాం



మేము ఆర్యవైశ్యులం. నా భర్త కిరాణం షాపులో పనిచేస్తాడు. ఆయన ఒక్కడు సంపాదించే డబ్బుతోనే ఇల్లు గడవాలి. జగనన్న సీఎం అయ్యాక మాకు సంక్షేమ పథకాలను వర్తింపజేయడంతో ఉన్నతంగా జీవిస్తున్నాం. నా కుమారుడికి అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తున్నారు. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం ఇచ్చారు. ఈబీసీ నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు అందుతున్నాయి. ఆయనకు అగ్రవర్ణ పేదలమంతా మేమంతా రుణపడి ఉంటారు.
– పి.త్రివేణి, వన్‌టౌన్ ఏరియా, కర్నూలు



చంటిబిడ్డతో బాధ్యతల స్వీకరణకు..

జిల్లాపై పూర్తి అవగాహన

- కర్నూలు హౌసింగ్ జేసీ, నంద్యాల జేసీగా చేసిన అనుభవం ఉంది
- స్పందన, రీసర్వే, ఆర్ఐఆర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తా
- నూతన జేసీ మౌర్య
- మూన్నెల్ల చంటిబిడ్డతో వచ్చి బాధ్యతల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): ఇదివరకే కర్నూలులో పనిచేయడంతో జిల్లాపై పూర్తి స్థాయి అవగాహన ఉందని నూతన జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు మూన్నెల్ల చంటిబిడ్డతో వచ్చిన ఆమె కర్నూలు జేసీగా బాధ్యతలు స్వీకరించారు. డీఆర్వో నాగేశ్వరరావు, ఆర్డీఓ హరి ప్రసాద్‌బాబు ఆమెకు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించాక జేసీ మర్యాదపూర్వకంగా కలెక్టర్ సృజనను కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కర్నూలు హౌసింగ్ జేసీ, నంద్యాల జేసీగా పనిచేయడంతో జిల్లాపై అవగాహన ఉందన్నారు. కర్నూలు లాంటి ప్రాముఖ్యత ఉన్న జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం (రీసర్వే), స్పందన సమస్యలు, ఆర్ఓఆర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. స్పందన, రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.



జేసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మౌర్య

ఏ విధమైన రాజకీయ ఒత్తిడి చేయలేదు..

'కర్నూలు జాయింట్ కలెక్టర్‌గా తాను రాజకీయ నేతలను ఆశ్రయించినట్లు ఓ పత్రికలో వచ్చిన కథనం పూర్తి అవాస్తవమని జేసీ కొట్టిపారేశారు. 'తాను మే 12 వరకు మెటర్నిటీ సెలవుల్లో ఉన్నానని, ప్రభుత్వ సూచనల మేరకు తిరుపతి కమిషనర్‌గా వెళ్లేందుకు సిద్ధమయ్యానన్నారు. అయితే, మళ్లీ కర్నూలు జేసీగా ఉత్తర్వులు రావడంతో సెలవులు రద్దు చేసుకుని మూన్నెళ్ల బిడ్డతో వచ్చి బాధ్యతలు స్వీకరిస్తున్నానన్నారు. ఐఏఎస్ అధికారులు ప్రభుత్వం ఎక్కడా విధులు, బాధ్యతలు ఇస్తే అక్కడ పనిచేయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి వార్తలు రాసే సమయాల్లో తమ వివరణ తీసుకుంటే బాగుంటుందని ఆమె చెప్పారు.

వ్యాక్సినేషన్‌లో పొరపాట్లను సహించం



వ్యాక్సిన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): వ్యాక్సినేషన్ నిర్వహించడంలో పొరపాట్లు జరిగితే సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 54, 55వ సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా బుధవారం వ్యాక్సిన్ వేయించుకోవాల్సిన లబ్ధిదారులు పూర్తిగాకుండానే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఉదయం 11.30 గంటలకే ముగించడం, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం యూపీహెచ్‌సీలోని వ్యాక్సిన్ నిల్వలను, కోల్డ్ చెయిన్ సిస్టమ్‌ను తనిఖీ చేశారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్‌కు రిమాండ్

బొమ్మలసత్రం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసానికి పాల్పడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమ్మరి శివయ్యను మంగళవారం రాత్రి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. కానిస్టేబుల్ తన కూతురు మంచి ప్యాకేజీతో పెద్ద కంపెనీలో ఉద్యోగం సంపాదించిందని నమ్మించి నంద్యాలలోని కొంత మంది వద్ద డబ్బు తీసుకున్నాడు. సాయినిరంజన్ అనే నిరుద్యోగి ఫిర్యాదు మేరకు శివయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

వానరానికి ప్రాణం పోసిన పశుసంచార వాహనం



గ్రామానికి చేరుకున్న సంచార వాహనం

పాణ్యం: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ బుధవారం వానరానికి ప్రాణం పోసింది. మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ వద్ద వానరం(కోతి) తీవ్ర వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయింది. గ్రామ యువకులు గమనించి 1962కి కాల్ చేశారు. నిమిషాల వ్యవధిలోనే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ అక్కడికి చేరుకుంది. అందులోని డాక్టర్ షాహిద్ వానరానికి చికిత్స అందించారు. అక్కడే ఫ్లూయిడ్స్ ఎక్కించారు. అరగంట తర్వాత తేరుకుంది. కాల్ చేసిన వెంటనే సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ గ్రామానికి చేరుకోవడంతో తమ పశువులు అనారోగ్యానికి గురైనా భయపడాల్సిన అవసరం లేదని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు(సెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని ఈనెల 14వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు, సంఘాలు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అంబేడ్కర్ జయంతి నిర్వహణపై వివిధ సంఘాలు ప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సభ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో జరిగిన లోటు పాట్లను సరిదిద్దుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.మౌర్య, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మరణధ్రువీకరణ పత్రాలకు క్యూ



క్యూలో నిల్చున్న దరఖాస్తు దారులు

కర్నూలు(హాస్పిటల్): వాత్సల్య పథకం కింద తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.4 వేలు ఇస్తుందని ప్రకటించడం, దరఖాస్తునకు గడువు ఇవ్వడంతో మరణధ్రువీకరణ పత్రాల కోసం వారి కుటుంబీకులు ఆసుపత్రికి తరలివస్తున్నారు. ఆసుపత్రిలోని మెడికల్ రికార్డు సెక్షన్‌కు గతంలో రోజూ 20 మంది దాకా మరణ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చేవారు, ఇప్పుడు వాత్సల్య పథకం రావడంతో రోజూ వచ్చే వారి సంఖ్య 50కి చేరింది. గత సోమవారం నుంచి దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా మరణించిన వారి డెత్‌స్లిప్, వారి ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ కోసం వచ్చే కుటుంబసభ్యుల ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకోరావాలని మెడికల్ రికార్డు సెక్షన్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. అన్ని పత్రాలు సరిగ్గా ఉంటే వెంటనే మరణ ధ్రువీకరణ పత్రం ఇస్తామని చెప్పారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

- 25 ఏళ్ల తర్వాత 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు
- ఉమ్మడి జిల్లాలో 209 మందికి కౌన్సెలింగ్
- 200 మంది హాజరు, 9 మంది గైర్హాజరు
- నాడు నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టుల భర్తీ



పోస్టింగ్‌ను ఎంపిక చేసుకుంటున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులుగా పనిచేయాలనేది వారి కల.. ఇందుకోసం టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని 1998 డీఎస్సీలో అర్హత కూడా సాధించారు. అయితే అప్పటి ప్రభుత్వం చేసిన తప్పిదం కారణంగా వారి కల నెరవేరలేదు. తమకు న్యాయం చేయాలని వీరు అనేక ఉద్యమాలు చేశారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. న్యాయస్థానాల చుట్టూ తిరిగి అలిసిపోయారు. ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరి సమస్యను తెలుసుకుని, తాము అధికారంలోకి వస్తే ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గతేడాది కాంట్రాక్ట్ పద్ధతిపై 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే అన్ని రకాల అనుమతులు తీసుకుని ఇటీవలే నియామకాలకు షెడ్యూల్ జారీ చేశారు. 1998 డీఎస్సీ రాసి అర్హత సాధించి ఉద్యోగాలు రాని అభ్యర్థుల సర్టిఫికెట్లను గతేడాది అక్టోబరు నెల మొదటి వారంలో పరిశీలించారు. వీరిలో 60 ఏళ్లలోపు ఉన్న వారిని మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేశారు. 1998 డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం 209 పోస్టులు భర్తీ చేయలేదు. దీంతో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్న వారిలో మెరిట్ అభ్యర్థులు 209 మందికి పోస్టులు ఇచ్చేందుకు బుధవారం కర్నూలు ఏ క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు 200 మంది హాజరుకాగా.. 9 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారికి జిల్లాలో ఖాళీగా ఉన్నటువంటి స్కూళ్లలో పోస్టులను కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, ఏడీ శ్యామూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ కేంద్రం దగ్గర ఆందోళన

1998లో అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఇచ్చిన నోటిఫికేషన్‌లో 1,345 పోస్టులు చూపించింది. ఇందులో 209 పోస్టులు మినహా మిగిలిన వాటిని భర్తీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అప్పుడు ఖాళీగా ఉంచిన పోస్టులను మాత్రమే ప్రస్తుతం భర్తీ చేసినట్లు చెప్పారు. అయితే సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకున్న వారందరికీ పోస్టులు ఇవ్వాలని కౌన్సెలింగ్ కేంద్రం దగ్గర 1998 డీఎస్సీ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఇది తమ పరిధిలోని లేని అంశమని, ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని, వినతిపత్రం ఇస్తే పై అధికారుల దృష్టికి తీసుకపోతామని డీఈఓ రంగారెడ్డి వారికి తెలియజేశారు.

కలలో కూడా ఊహించలేదు



ప్రస్తుతం ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. 1998 డీఎస్సీలో 62.5 మార్కులు వచ్చాయి. గతంలో జరిగిన కొన్ని తప్పుల వల్ల నాకు నాడు ఉద్యోగం రాలేదు. చంద్రబాబు 2004లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు ఇవ్వలేదు. 2008లో వైఎస్ఆర్ కూడా 98 డీఎస్సీ అభ్యర్థులు ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. కానీ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే ఎన్నికలు రావడం, ఆ తరువాత ఆయన మరణించడంతో మా గురించి ఎవరూ పట్టించుకోలేదు. చాలా ఇబ్బందులు పడ్డాం. 98 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారు.

– ఎస్.అక్బర్, ఎమ్మిగనూరు



కౌన్సెలింగ్‌లో సూచనలు చేస్తున్న డీఈఓ

చాలా సంతోషం



1998 డీఎస్సీలో నాకు 62.5 మార్కులు వచ్చాయి. టీచర్ కావాలనే కల చాలా ఏళ్ల తరువాత సాకారం అయ్యింది. ఏ రోజైనా ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఉండేది. ఆశలు వదులుకునే సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాకు ఉద్యోగం ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

– తోట నాగ లక్ష్మయ్య, ఆత్మకూరు

కల సాకారం అయ్యింది



టీచర్ ఉద్యోగం సాధించాలనే కల 25 ఏళ్ల తరువాత సాకారం కావడం చాలా ఆనందంగా ఉంది. కుటుంబ పోషణ కోసం ప్రైవేటు స్కూల్ ఏర్పాటు చేసుకున్నాను. ఆ స్కూల్ నడవకపోవడంతో మూత వేసి, ప్రస్తుతం మానసిక వైద్య నిపుణులుగా నంద్యాలలోనే పనిచేస్తున్నాను. ఇన్నేళ్ల తరువాత ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

– టి.పుల్లయ్య, నంద్యాల

మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. 2019 నుంచి ఇప్పటి వరకు 17 కేసులకు సంబంధించిన 13 నాటు సారా పాలిథిన్ సంచులు, గోవా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన టెట్రా ప్యాకెట్లు, మద్యం సీసాలను డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ శేషయ్యల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని బహిరంగ ప్రదేశంలో ఉంచి జేసీబీతో ధ్వంసం చేశారు.

ఉడుములపాడు బంకర్ మద్యం కూడా..

పట్టణ సమీపంలోని ఉడుములపాడు గ్రామంలో టీడీపీ అనుచరుడు ఉప్పరి రాంబాబు తన ఇంటిలో బంకర్(అండర్ గ్రౌండ్) ఏర్పాటు చేసుకుని అక్రమంగా నాసిరకం మద్యం తయారు చేస్తూ 2019 డిసెంబరులో పట్టుబడిన సంగతి విదితమే. వందల సంఖ్యలో మద్యం బాటిళ్లు, ఖాళీ సీసాలు, మూతలు, వివిధ కంపెనీల లేబుళ్లు, స్పిరిట్ తదితర వస్తువులను అప్పట్లో సెబ్ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రధాన నిందితుడు రాంబాబును అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిచ్చిన సమాచారంతో అప్పటి టీడీపీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ ప్రతాప్ ఇంట్లో దాడులు చేయగా 26 ఖాళీ కేన్లు లభ్యమయ్యాయి. వాటన్నిటినీ ధ్వంసం చేశారు.

గుండె గుడిలో..



దేవుడి గుడిలో సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్‌ను ఉంచిన బాయికాటి మద్దిలేటి, లక్ష్మిదేవి

సి.బెళగల్: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. మండల కేంద్రమైన సి.బెళగల్‌లో బుధవారం సాయంకాలం గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన బాయికాటి మద్దిలేటి, లక్ష్మిదేవి దంపతులు సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్‌ను తమ ఇంటిలోని దేవుడి గుడిలో అతికించి అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్రంలో మంచి పరిపాలన సాగుతోందని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని ఈ సందర్భంగా వారు తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలి

నందవరం/పెద్దకడబూరు: విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో– ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆయన నందవరం, పెద్దకడబూరులలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను తనిఖీ చేశారు. టీచింగ్ స్టాఫ్ పాఠ్యాంశాల ప్రణాళికలు, డైరీ, డైనింగ్ హాల్, స్టాక్ రిజిస్టర్లు, విద్యార్థినుల నోటుబుక్స్ పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి పిల్లల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థులు ప్రభుత్వం అందించిన ట్యాబులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిజిటల్ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని టీచర్లకు సూచించారు. విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని అప్పుడే మంచి మార్కులొస్తాయన్నారు. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. పెద్దకడబూరు కేజీబీవీలో స్టాక్ వివరాలు సరిగ్గా లేకపోవడంతో ప్రిన్సిపాల్ చైతన్య ప్రవంతిపై మండిపడ్డారు. ఆయా పాఠశాలల తనిఖీలో గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునీత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సెబ్ సిబ్బందిపై నాటుసారా తయారీదారుల దాడి



దాడిలో గాయపడిన సెబ్ స్పెషల్ ఎస్ఐ ఓబులేసు, కానిస్టేబుల్ సురేష్

పత్తికొండ రూరల్: నాటుసారా తయారీదారులు బరితెగించారు. సెబ్‌పోలీసులపై దాడికి పాల్పడ్డారు. దాడిలో సెబ్ విజయవాడ ఎస్ఐ ఓబులేసు, కానిస్టేబుల్ సురేష్‌కు గాయాలయ్యాయి. సెబ్ సిబ్బంది బుధవారం తెల్లవారుజామున మఫ్టీలో బుగ్గతండా గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గ్రామ సమీపంలోని కొండల్లో మంటలు కనిపించడంతో అక్కడికి వెళ్లారు. వీరిని నాటుసారా తయారీదారులు చుట్టుముట్టారు. కొత్త వ్యక్తులు ఇక్కడికి ఎందుకు వచ్చారు అని ప్రశ్నించారు. తాము పోలీసులమని చెబుతున్నా పట్టించుకోకుండా దురుసుగా ప్రవర్తిస్తూ విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. దాడిలో సెబ్ ఎస్ఐ ఓబులేసు, కానిస్టేబుల్ సురేష్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపాల్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్ఎస్ఐ ఓబులేసు ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని, మిగిలిన వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ మురళీమోహన్ తెలిపారు.

కర్నూలు నగరంలో నిప్పుల వర్షం

- గరిష్ట ఉష్ణోగ్రత 42.5, కనిష్ట ఉష్ణోగ్రత 24.8 డిగ్రీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఎండలు మండుతున్నాయి. బుధవారం భానుడు కర్నూలు నగరంపై నిప్పుల వర్షం కురిపించాడు. వడగాలుల తీవ్రతకు ప్రజలు ఉక్కిరి, బిక్కిరయ్యారు. కర్నూలులో అత్యధికంగా 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా భారీగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 24.8 డిగ్రీలు నమోదు కావడం గమనార్హం. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య ఎండల తీవ్రతకు ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడ్డారు. ప్రధాన రహదారులపై ఎండల కారణంగా రద్దీ బాగా తగ్గింది. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత కర్నూలులోనే నమోదు కాగా మంత్రాలయం మండలం వగరూరులో 41.7, కోడుమూరు మండలం లద్దగిరిలో 41.1, కౌతాళం మండలం నదిచాగిలో 41.0, కోసిగి మండలం సాతనూరులో 40.9 ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం పెద్ద దేవలాపురంలో 42.4, నంద్యాలలో 42.1, కొలిమిగుండ్ల మండలం బోయల ఉప్పలూరులో 42.0, బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడులో 41.6 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. వడగాలుల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు బయటికి వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

అగ్నికి కారు ఆహుతి



మంటల్లో కాలిపోతున్న కారు

డోన టౌన్: స్థానిక కొత్తపేటలోని శ్రీదేవి బ్యూటీ పార్లర్ సమీపంలో నిలిపి ఉన్న కారు మంగళవారం రాత్రి అగ్నిప్రమాదంలో కాలిపోయింది. బాధితుడు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన ఆంజనేయులు అలియాస్ విక్రమ్ మంగళవారం ఉదయం తన ఎంజీ హెక్టార్ కార్‌లో కర్నూలుకు వెళ్లాడు. తిరిగి రాత్రి 9 గంటలకు డోన్‌కు చేరుకుని బ్యూటీ పార్లర్ సమీపంలో ఉన్న బంధువుల ఇంటి వద్ద కారు పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. దాదాపు 11 గంటల ప్రాంతంలో ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి యజమానికి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపు కారు పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.22 లక్షల విలువ చేసే కారు అగ్నికి ఆహుతైందని బాధితుడు తెలిపాడు.

శ్రీవారి సన్నిధిలో సేవకు వెళ్లి..

- గుండెపోటుతో మహిళ మృతి



సుంకురత్నమ్మ(ఫైల్)

కృష్ణగిరి: తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో సేవ చేసేందుకు వెళ్లిన ఓ మహిళా గుండెపోటుకు గురై మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. కృష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామానికి చెందిన 19 మంది ఈ నెల 10న తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో సేవ చేసేందుకు బయలుదేరారు. తిరుపతిలోని అమ్మవార్లను దర్శించుకుని 11న తిరుమల కొండపైకి వెళ్లారు. స్వామి వారి సేవకు వెళ్లేందుకు గంట ముందు బోయ సుంకురత్నమ్మ(53) అనే మహిళకు గుండెపోటు వచ్చింది. గుర్తించిన గ్రామస్తులు వెంటనే ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలియజేశారు. దేవస్థానం కమిటీ సభ్యులు పోస్టుమార్టం చేయించి ఉచిత అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని గ్రామానికి చేర్చినట్లు కుమారుడు బోయ మహేంద్ర తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, మహేశ్వరరెడ్డి, శిగరమాను కృష్ణమూర్తి తదితరులు సుంకురత్నమ్మ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

టీడీపీ నేతలవి వక్ర బుద్ధులు

- లోకేష్ పాదయాత్రను ప్రజలు నమ్మరు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



మంత్రి జయరాం సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన పి.కోటకొండ టీడీపీ నాయకులు

ఆలూరు: టీడీపీ నేతలవి వక్ర బుద్ధులని, వారిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దస్తగిరి గౌడు, శేఖర్‌గౌడు, కౌలుట్ల, మరో 20 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుస్తామనే భ్రమలో టీడీపీ నేతలు ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన మాజీ సీఎం చంద్ర బాబు నాయుడు తిరిగి అధికారంలోకి ఎలా వస్తారో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాద యాత్రలో తేల్చి చెప్పడం లేదన్నారు. లోకేష్ పాదయాత్రను ప్రజలు నమ్మడం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన వైఎ స్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన రైతు మదిరె పెద్దలింగన్న



గాయాలపాలైన ఆస్పరి మహానంది

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఓవర్ బ్రిడ్జిపై ఆటో రెండు బైకులను ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆదోని వైపు పని నిమిత్తం మండలంలోని మదిరె గ్రామానికి చెందిన పెద్దలింగన్న(55), ఆస్పరి మండలానికి చెందిన మహానంది వేర్వేరు బైక్‌లపై వస్తున్నారు. ఓవర్ బ్రిడ్జిపై వెళ్తుండగా వెనుక నుంచి ఆటో బలంగా వారి బైక్‌లను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో మదిరె గ్రామానికి చెందిన పెద్దలింగన్న చికిత్స పొందుతూ మృతిచెందాడు. వ్యవసాయం చేసుకుని జీవించే ఈయనకు భార్య, ఒక కుమారుడు సంతానం. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

శాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలి

- రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి సూచనలు




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు మారుమూల గ్రామాల రైతులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు, కర్నూలు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం అనంతపురం జిల్లా రేకులకుంట వ్యవసాయ క్షేత్రంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల వ్యవసాయ యంత్రాంగంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. కొత్త వంగడాల ద్వారా వ్యవసాయంలో అధికోత్పత్తి సాధించే అవకాశం ఉందని తెలిపారు. అయితే, ఆ వంగడాలు ఆర్‌బీకేల ద్వారా గ్రామీణ రైతులకు చేరే విధంగా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి ఇచ్చిన సూచనలను డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రశాంతి స్వాగతించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి కూడా పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి యాచకుడి డబ్బు

- అనారోగ్యంతో యాచకుడి మృతి
- రూ.2.90 లక్షలు స్వాధీనం చేసుకున్న వక్ఫ్ బోర్డు అధికారులు



యాచకుడు షరీఫ్ మృతదేహం



స్వాధీనం చేసుకున్న డబ్బును చూపుతున్న వక్ఫ్ బోర్డు అధికారులు

హొళగుంద: యాచకుడి డబ్బును దర్గా అభివృద్ధికి ఖర్చు చేయాలని అధికారులు నిర్ణయించారు. యాచకుడు భిక్షాటన చేసి కూడబెట్టిన సొమ్మును కొందరు కాజేసేందుకు యత్నించారు. పోలీసులకు ఈ విషయం తెలిసి హెచ్చరికలు జారీ చేయడంతో తిరిగి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ డబ్బు తీసుకోవాల్సిన యాచకుడు అనారోగ్యం, వృద్ధాప్య సమస్యలతో ఈ లోకాన్ని వీడి వెళ్లాడు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బెళ్గాం జిల్లాకు చెందిన మహమ్మద్ షరీఫ్(72).. 25 ఏళ్ల క్రితం ఎల్లార్తి దర్గాకు వచ్చి ఇక్కడే భిక్షాటన చేసుకుంటూ కాలం గడిపేవాడు. కొద్ది రోజులుగా వృద్ధాప్య సమస్యతో కదల లేనిస్థితికి చేరాడు. దర్గా పరిసరాల్లోని కొందరు గమనించి అతనికి సపర్యలు చేస్తుండగా రూ.2.90 లక్షల నగదు కనిపించాయి. ఆ డబ్బును లెక్కించి కొందరు తమ వద్ద పెట్టుకున్నారు. డబ్బును కాజేస్తున్నారని ఆరోపణలు రావడంతో మంగళవారం ఎస్ఐ అబ్దుల్‌జహీర్ డబ్బు లెక్కించిన వారిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అయితే బుధవారం తెల్లవారుజామున యాచకుడు మహమ్మద్ షరీఫ్ మృతి చెందాడు. గ్రామ పెద్దల సహకారంతో షరీఫ్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

యాచకుడి డబ్బును స్వాధీనం చేసుకున్న వక్ఫ్ బోర్డు అధికారులు

విషయం తెలుసుకున్న వక్ఫ్‌బోర్డు ఆడిటర్ అండ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అజీమ్ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎల్లార్తి దర్గాకు చేరుకుని డబ్బు గురించి ఆరా తీశారు. యాచకుడి డబ్బును తమ వద్ద ఉంచుకున్న వారితో మాట్లాడి రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో రూ.2.90 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బును దర్గా అభివృద్ధికి వాడాలని స్థానికులు అజీమ్‌ను కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి యాచకుడు షరీఫ్ పేరిట దర్గాలో అభివృద్ధి పనులకు ఈ డబ్బును వాడుతామని ఆయన హామీనిచ్చారు.